# 40. వ్యంగ్య "ధ్వని"

**జ**వహర్లాల్ నెహ్రూగారు ఇండియా ప్రధానమంత్రిగా ఉన్నరోజుల్లో, ఓనాడు ఉదయం ఎనిమిది గంటలకి ఆయన ఆఫీసు రూంలోకొచ్చేసరికి ఆయన పర్సనల్ సెక్రటరీ గాభరా గాభరాగా ఓ వీక్లీ దాచేస్తూ దొరికిపోయాడు. (ఇప్పటి రోజుల్లో అయితే ఒక పెద్ద మనిషి చూస్తాడేమో అని మరో పెద్ద మనిషి దాచేసే వీక్లీలు చాలా ఉన్నాయి.) తను ఆఫీసు కొచ్చేసరికి పర్సనల్ సెక్రటరీగారు ఆ రోజు పేపర్లన్నీ చూసేసి వాట్లో ప్రధానమంత్రి ప్రసంగాలు గాని ప్రయాణ వివరాలు గాని వార్తా చిత్రాలు గాని ఉన్న చోట్ల ఎర్రసిరా పెన్నుతో బోర్డర్లు కట్టి వుంచడం ఆయనకి అందుబాట్లో పెట్టడం నెహ్రూగారు అలవాటు చేసేరు. (ఈ పద్ధతి ఇప్పటికీ కొందరు ముఖ్యమంత్రులూ-ముఖ్యులుకాని మంత్రులూ కూడా-అమలు చేస్తున్నారట).

సరే, పేపర్లన్నీ శ్రద్ధగా ఓ కంట పరిశీలిస్తూ రెండో కంటితో తన పర్సనల్ సెక్రటరీగారు తను దాచేసిన ఆ వీక్లీని ఎలా కాపాడుకుంటున్నాడా అని మూడో కంటి వాడికి తెలియకుండా గమనించేరు నెహ్రూగారు. ఆఖర్ని ఇక ఆగలేక "ఇవాళ శంకర్స్ వీక్లీ రావాలే?" అన్నారు. "వ వ వ్వ వ్వచ్చింది సార్" అని పి.ఎస్. గారు టేబిలు మీద కాగితాల బొత్తికింద నించి ఆ వీక్లీ తీసి అందించడంలో ఆ పుస్తకం కవర్ పేజీ కాక , లోపలి పేజీ ఒక దాని దగ్గర వెనక్కి మడతపెట్టి ఉన్నది యధాతథంగా ఆయనకి అందిపోయింది. ఆ పేజీలో శంకర్ వేసిన ఒక కార్టూను ఉంది. "భారతదేశంలోని ముగ్గురు అతి ముఖ్యులు" అని కిందన ఒక కేప్షన్‌తో ఉంది ఆ కార్టూన్. మీదని మూడు ఫ్రేముల్లోనూ కూడా నెహ్రూగారి బొమ్మలే ఉన్నాయి. క్షణంలో సగం సేపు మాత్రం ఆ కార్టూన్ చూసిన నెహ్రూగారు సుమారు మూడు నిమిషాలపాటు విరామం లేకుండానూ నిర్మొహమాటంగానూ నవ్వుకుంటూ వుంటే పర్సనల్ సెక్రటరీ గారికి ఏం తోచలేదు. "అలా గాభరా పడతారేం? శంకర్‌కి ఫోన్ చేసి నేను చాలా ఎంజాయి చేసేనని చెప్పండి!" అని నెహ్రూగారు అనేదాకా ఆ పి.ఎస్ గారు కోలుకోలేదు, పాపం.

మన గుణగణాలూ చర్యలూ ప్రవర్తనా చూసి ఎవరో నవ్వినా, సరదాపడినా కూడా విచిత్రంగా రియాక్ట్ అవడం మనలో చాలామందికి అలవాటు. ఒకర్ని చూసి నవ్వినంత సుళువుగా మనల్ని చూసి మనం నవ్వుకోలేం, పాపం.

తెలుగు సాహిత్యంలో "హాస్యబ్రహ్మ"గా పేరుపొందిన భమిడిపాటి కామేశ్వర్రావు గారు "నామీదే నర్రోయ్!" అనే చిన్న నాటిక ఒకటి రాసేరు. ఎవరో ఎక్కడో ఏదో చెప్పిగాని పత్రికలో రాసి గాని జనాల్ని నవ్వించడానికి ప్రయత్నిస్తే అది చూసో, వినో "నా మీదే నర్రోయ్" అని భుజాలు తడుముకునే వాళ్లు ఉంటారనీ, నవ్వుకునే సందర్భం వొచ్చినా ఏడ్చుకోడమే మనవాళ్లకి ఆనవాయితీ అనీ ఈ నాటికలో సందేశం. పనిలో పనిగా చెప్పాలి; భమిడిపాటి కామేశ్వరరావు గారికి హాస్యబ్రహ్మ అని బిరుదు ఇచ్చేసి మనం ఆయన్ని వదల గొట్టేసుకున్నాం. దాంతోటే ఆయన ఎకవుంటు క్లోజైపోయింది. ఆయన రాసిన నాటకాలు, నాటికలు, హాస్య ప్రసంగాలు, జోక్ - సంకలనాలు ఏ ఒక్కటీ కూడా ఇవాళ ఎక్కడా దొరకవు. మన హాస్య బ్రహ్మ గారి

పుస్తకాలు అతి హాస్యాస్పదంగా మరుగున పడిపోయాయి. ఆయన పోయిన ముప్ఫై ఏళ్లలోనే.

నెహ్రూగారి ఏకైక పుత్రికగా, ఎవరికీ అందనంత సన్నిహితంగా ఆయన సాహచర్యం దొరకబుచ్చుకున్న ఏకైక వారసురాలిగా ప్రఖ్యాతి చెందిన ఇందిరాగాంధీ గారి హయాంలో ఎవరో "కిస్సా కుర్సీకా" అనే వ్యంగ్య ప్రధానమైన సినిమా తీస్తే ఆనాటి ఢిల్లీ అధికార అనధికార పీఠాలు తీవ్రంగా స్పందించి ఆ చిత్రాన్ని ప్రజల్లో కొందరు చూసేస్తే (ఎంత గొప్ప సినిమా అయినా దేశంలో అందరూ చూసెయ్యరు కదా) ఏం కొంప మునుగుతుందో అని 'భయపడి' ఆ సినిమాకి సెన్సారు సర్టిఫికెటు ఇయ్యకుండా చూడ్డమే కాక, ఆ సినిమా మొత్తం ప్రింట్లు నెగటివ్‌తో సహా స్వాధీన పరచుకొని నామరూపాలు లేకుండా దగ్ధం చేసిన సంగతి కూడా మనం ఇక్కడ ప్రస్తావించుకోవచ్చును.

సినిమా అంటే పోనీ ఏదో పవర్‌ఫుల్ మీడియం కనుక అది చూస్తేనే డేంజరు అనుకుంటే ఏమోగాని, ఆ మధ్య తమిళనాడులో ఒక పత్రికలో ఒక కార్టూన్ ప్రచురించినందుకు ఆగ్రహించి ఆ రాష్ట్రపు అప్పటి ప్రభుత్వం ఆ పత్రిక సంపాదకుడినీ, ఆ కార్టూనిస్టునీ నానా హింసలూ పెట్టడమే కాకుండా ఆ పత్రిక ఆఫీసు (తాత్కాలికంగా) మూసేసే చర్య కూడా తీసుకుంది. ప్రభుత్వపు విధానాలను గాని నాయకుల చర్యలను గాని చూసి అవి తమకు మేలు చేయడం లేదని గ్రహించే ప్రజలు తమ నిస్సహాయతను కనీసం వ్యంగ్య చిత్రాల ద్వారా నైనా వ్యక్తపరచడానికి వీల్లేకుండా చూడడం మన పత్రికా స్వాతంత్ర్యంలో ఒక గొప్ప విశేషం. "ఎ పిక్చర్ స్పీక్స్ ఎ థవుజండ్ వర్డ్స్" (ఒక బొమ్మకు వేయి మాటల శక్తి ఉండొచ్చు) అన్నారు. అందుచేత బొమ్మలు (కార్టూన్‌లు) వేస్తే వెయ్యి మాటలూ ఒక్కసారి తల పగలకొట్టేస్తాయని భావించి కేవలం మాటల్లోనే వ్యంగ్య చిత్రాలు తయారు చేసేవాళ్లు వ్యంగ్య రచయితలు.

అమెరికాలో ఆర్ట్ బుష్ వాల్డ్ అని ఒక వ్యంగ్య రచయిత ఉన్నాడు. ఇతను అమెరికా ప్రభుత్వంతో సహా ప్రపంచంలో ఏ ప్రభుత్వాన్నయినా సరే తన వ్యంగ్య రచనలతో వేళాకోళం చెయ్యడానికి జంకడు. ఇందులో విశేషం ఏమిటంటే ఇతను సాధారణంగా తన వ్యంగ్య రచనను కథా రూపంలో చేస్తాడు. ఈ కథలో ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, అధ్యక్షుడు - అంటూ ముసుగులో గుద్దులాట పెట్టుకోకుండా హాయిగా నిక్సన్, జాన్సన్, రీగన్, బుష్ అంటూ పేర్లు ఉపయోగించి మరీ రాస్తాడు ఆ కథలు. ప్రెసిడెంట్ గారు తీసుకున్న ఏదో ఒక అసందర్భపు (అపకారపు) నిర్ణయం ఉదహరించి "ఏమండీ ప్రెసిడెంటు గారూ ఇలాంటి బుద్ధిలేని పనిచేసేరు?" అని తను ఆయన్ని అడిగినట్టూ ఆ ప్రెసిడెంటుగారు తను తీసుకున్న నిర్ణయమో చేసిన ప్రసంగమో సమంజసం గానే ఉందని సమర్ధించుకోడానికి బలహీనమైన వాదం చేస్తూ చివరికి "సారీ బుష్వాల్డుగారూ, నాది పొరపాటే" అని ఒప్పేసుకున్నట్టు రాసిన కథలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఆర్ట్ బుష్వాల్డ్ వ్యంగ్య కథలు సంపుటాలుగా వెలువడి ప్రపంచం అంతటా లక్షల సంఖ్యలో కాపీలు అమ్ముడు పోవడమే కాక, ఆ వ్యంగ్య కథల్ని తమ పత్రికల్లో ఎత్తి అచ్చువేసుకునే పత్రికాధిపతులు ప్రపంచం అంతటా ఉన్నారు. ఇది అమెరికా మార్కు పత్రికా స్వాతంత్ర్యం.

మనదేశంలో కూడా, "కిస్సా కుర్సీకా" సినిమా అయితే అలా ఏష్యం అయిపోయింది గాని; ఎన్.టీ. రామారావుగారు ముఖ్యమంత్రిగా ఇక్కడా సెన్సార్ డిపార్టుమెంటును కంట్రోల్

చేసే కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోనూ ఉన్న రోజుల్లో రామారావు గార్ని ఎద్దేవా చేసినవి, వేళాకోళం చేసినవి, జుగుప్సాకరంగా తీర్చిదిద్దినవి సుమారు పది పన్నెండు సినిమాలు సెన్సార్ సర్టిఫికేట్స్ సంపాదించమే కాక డబ్బు కూడా సంపాదించుకున్నవి వచ్చేయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వం లోని వి.ఐ.పి. లని తప్ప వేరే ఏ ప్రజానాయకుణ్ణి అయినా వేళాకోళం చేస్తే సెన్సార్ సర్టిఫికెట్ రావడం పెద్ద కష్టం కాదు. అయితే కేంద్ర ప్రభుత్వాన్నో ఆ బాపతు వి.ఐ.పి. లని ఏమాత్రం గిల్లినా ఇంతే సంగతులు. దీనికి "కిస్సాకుర్సీకా" అనంతరం సరికొత్త ఉదాహరణ "తరక్ ధన్ ధన్" అనే టి.వి. సీరియల్. రమేష్ శర్మ అనే ఆయన దీని రచయిత , నిర్మాత కూడా. ఈ సీరియల్ దూరదర్శన్ కోసం తయారు చేసిందికాదు, వీడియో లైబ్రరీల నెట్‌వర్క్‌లో ప్రయివేటు(గా) వేసి చూసుకోడానికే. ఇందులో వి.పి. సింగ్ గారి ప్రభుత్వం రావడం పోవడం, చంద్రశేఖర్ గారి ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఊగులాడ్డం కృత్రిమమైన పేర్లతో ఉదహరించారు రచయిత. కేంద్ర సెన్సార్ బోర్డు వారు ఈ పేర్లు కృత్రిమంగా ఉన్నా అందరికీ బోధపడి పోతున్నాయని బాధపడి సర్టిఫికేటు ఇవ్వడానికి నిరాకరించేరు. ప్రస్తుతం ఫిలిం అపలేట్ ట్రిబ్యునల్‌లో ఈ వీడియో సీరియల్ విడుదల సాధ్యాసాధ్యాలుగా పరిశీలనలో ఉన్నాయి.

"తరక్ ధన్ ధన్" అంటే అసలర్థం ఏమిటో గాని, నాకు మాత్రం ఇదో అర్థంలేని "ధ్వని" లా వుంది. ఏం చేస్తాం!

★

# 41. "విధానమే ప్రధానము"

ఎక్కడ చదివేనో చప్పున గుర్తు రావడం లేదు గాని, జోకులా కనిపించే ఒక స్వభావోక్తి కథ చదివేను, ఒకసారి.

ఒకానొక విందు కార్యక్రమానికి, ఒకే భవనంలో ఉంటున్న ఒక ఫ్రెంచి ఆసామీ, ఒక బ్రిటీష్ ఆసామీ-రావలసిన సమయానికి బాగా ఆలస్యంగా వచ్చారుట. ఆలస్యానికి కారణాలు చెప్తూ ఆ ఫ్రెంచి ఆసామీ, ఆ బ్రిటీష్ ఆసామీ; ఒకే కథను రెండు బాణీల్లో చెప్పేరుట.

"అమ్మయ్యో! ఆలస్యంగా వొచ్చాననంటే రానూ మరి! అసలు ఆలస్యంగా అయినా రాగలిగాననంటే అది మెచ్చుకోవలసిన సంగతి! ఏం జరిగిందనుకున్నారు! మా బిల్డింగ్ ఉందా? ఏం-ఆ బిల్డింగ్ యజమాని; వాణ్ణి తవ్విపాతరెయ్యా. నాలుగంతస్తులు కట్టేడు, ఒక్కొక్క అంతస్తుకీ ఆరేసి ఎపార్టుమెంట్లు . ఒక్కొక్క ఎపార్టుమెంటుకి వెయ్యేసి (రూపాయలు) అద్దె. అంటే ఎంతయింది? ఇరవై నాలుగు వేలు! ఇంకా ఆశ చావలేదు, మానవుడికి! అయిదో అంతస్తు కట్టి అక్కడ కూడా ఆరు ఎపార్టుమెంట్లు ఏర్పాటు చేసి మరో ఆరుగురికి అవి అద్దెకిచ్చేసి ఇప్పుడొస్తున్న ఇరవై నాలుగువేలే కాక ఇంకో ఆరువేలు నొల్లు కుందామని 'ప్లాను' వేసేడు! సరే ప్లాను ఎప్రూవు చేయించుకుని నిర్మాణం సాగిస్తున్నాడు. ఇవాళ ఇక్కడ డిన్నరు రాత్రి ఎనిమిదింటికి కదా. సరే, ఏడున్నరకి డిన్నర్ డ్రస్ వేసుకుని ఇక బయల్దేరుదామని సిద్ధం అయ్యానో లేదో; పైని పెద్ద ప్రళయం లాంటి చప్పుడు! అడావిడిగా నా ఎపార్టుమెంట్ లోంచి